క్లుప్తంగా

బస్టాండ్‌లో భద్రత పెంచండి

తిరుపతి క్రైం: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఆధారంగా రోజు 2 లక్షల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రోజు 4వేల సర్వీసులు వచ్చిపోతుంటాయి. శ్రీహరి, శ్రీనివాసం, ఏడుకొండలు, పల్లె వెలుగు బస్టాండ్లలో చోరీలు జరగకుండా భద్రత పెంచాలని ఆర్టీసీ అధికారులు కోరారు. వారు శనివారం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు నేతృత్వంలో పలువురు ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, కంట్రోలర్లు ఈస్ట్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ సురేంద్రరెడ్డిని విన్నవించారు. స్పందించిన డీఎస్పీ తప్పకుండా భద్రతా సిబ్బందిని పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తామని చెప్పారు.

సమయపాలన పాటించాలి

పాకాల: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి ఆదేశించారు. ఆయన శనివారం మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. అసిస్టెంట్ అకౌంటెంట్ మోహన్, తనిఖీ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మంత్రి

తిరుమల: శ్రీవారిని శనివారం సుప్రభాత సేవలో మంత్రి కొట్టు సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఫార్మసీ నిపుణులకు యూఎస్‌ఏలో అవకాశాలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఫార్మసీ నిపుణులకు యూఎస్‌ఏలో మంచి అవకాశాలు ఉన్నాయని ఔట్ పేషెంట్ ఫార్మసీ డైరెక్టర్ సూర్యకుమార్ తెలిపారు. మహిళా వర్సిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ టెక్నాలజీలో శనివారం ఫార్మసీ రంగంలో స్వయం ఉపాధి కల్పన అనే అంశంపై ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. యూఎస్‌ఏలో ఫార్మసీ అవుట్‌లెట్లను ప్రారంభించేందుకు కావాల్సిన అవసరాలపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వీసీకి అభినందనలు



తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ డి.భారతిని శనివారం వర్సిటీ లీగల్ ఆఫీసర్ దేవిరెడ్డి భాస్కర్ రెడ్డి, న్యాయ విభాగాధిపతి ప్రొఫెసర్ సీతాకుమారి కలిశారు. వీసీని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు.

రేపటి నుంచి పనపాకంలో ఉచిత వైద్య పరీక్షలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నుంచి చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో రూ.2,950 విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా చేయనున్నారు. పనపాకం జెడ్పీ ఉన్నత, అరిగిలవారిపల్లి ప్రాథమిక, రవనప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాలల ప్రాంగణంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.

బంగారుతిరుచ్చిపై మురళీనాథుడు

చంద్రగిరి(తిరుపతి రూరల్): రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో విహరించారు.

ఉద్యోగాలకు 145 మంది ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: ఏటీఎస్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫైనలియర్ విద్యార్థులకు మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు ఆ కళాశాల డైరెక్టర్లు మోహన్‌కృష్ణ, నరేంద్రకుమార్ తెలిపారు. ఇందులో వివిధ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. 145 మంది విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని, వారికి నియామక పత్రాలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

చంద్రగిరి(తిరుపతి రూరల్): కాలూరు సమీపంలో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని శనివారం మృతుడు భార్య స్వప్నకు చంద్రగిరి ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంపీటీసీ అశ్విని, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ చెంచురత్నం అందజేశారు. అంతకుముందు చంద్రశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు బహుజన రాజ్యాధికార సభ

తిరుపతి కల్చరల్: రాజ్యాధికారమే లక్ష్యంగా సోమవారం సాయంత్రం మదనపల్లి మిషన్ కాంపౌండ్ ఆవరణలో నిర్వహించనున్న రాయలసీమ బహుజన రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.గుర్రప్ప పిలుపునిచ్చారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు మదనపల్లి టిప్పు సుల్తాన్ గ్రౌండ్ నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన ఉంటుందన్నారు.









ఆణిముత్యాల సంబరం

తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ ఆడిటోరియంలో శనివారం జగనన్న ఆణిముత్యాలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

- తిరుపతి ఎడ్యుకేషన్

ప్రణాళికాబద్ధంగా భూముల రీసర్వే

తిరుపతి అర్బన్: భూముల రీసర్వేను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్దార్థ్‌జైన్ ఆదేశించారు. ఆయన శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల సర్వే ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేతో రైతులకు వారి భూములపై స్పష్టమైన హక్కులు వస్తాయని వెల్లడించారు. దేశ చరిత్రలో బ్రిటీష్ హయాం తర్వాత తొలిసారి భూములను రీ సర్వే చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి భూ కమతానికి ఆధార్ నంబర్‌లా విశిష్ట సంఖ్యను కేటాయించనున్నట్లు వివరించారు. భూ వివాదాలకు స్వస్తి పలకడమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. రీసర్వే చేపట్టాల్సిన గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్



మాట్లాడుతున్న కమిషనర్ సిద్ధార్థ్ జైన్

మాట్లాడుతూ భూముల రీసర్వే , రికార్డుల ఆధునికీకరణపై పలు పర్యాయాలు శిక్ష ఇచ్చినట్టు వెల్లడించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు, గడపగడపలో వచ్చిన వినతులను సైతం సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా అండర్–9 బాలబాలికల నిర్వహిస్తున్న చెస్ పోటీలు శనివారం ముగిశాయి. శనివారం జరిగిన పోటీల్లో 34 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో భువన్ ఆరోన్, పునీత్ బండ్ల, బాలికల విభాగంలో ఒంటి శ్రీగురువర్షిణి, ఈషా మోహన్‌బండీ మొదటి రెండు స్థానాలు సాధించారు. వీరిని ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఏ.శర్మ, జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇక్కడ గెలిచిన వారు ఈ నెల 23 నుంచి



విజేతలతో చెస్ నిర్వాహకులు

25వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–9 చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస సూరి తెలిపారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని ఏడుకొండల బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుమలకు వెళుతున్న డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఘాట్ రోడ్డులో ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని స్పష్టం చేశారు. ముందు సర్వీస్‌ను అధిగమించరాదని పేర్కొన్నారు. ఘాట్ రోడ్డులో ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వీసుకు చిన్నపాటి సమస్య ఉన్నా అప్పటికప్పుడే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

శ్రీవాణి ట్రస్టుపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు అవాస్తవం

తిరుపతి లీగల్ /తిరుపతి క్రైం: టీటీడీ శ్రీవాణి ట్రస్టుకు ఇచ్చే విరాళానికి బిల్లు ఉండదని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు అజ్ఞానంతో చేసినవని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది దొరబాబు తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేలు చెల్లిస్తే టీటీడీ తప్పనిసరిగా రసీదు ఇస్తోందన్నారు. ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన టీటీడీపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా, టీటీడీ పరువుకు భంగం కలిగించేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చిన పవన్ కళ్యాణ్ యాత్ర పేరుతో తెలంగాణ నుంచి వచ్చి రాష్ట్రంలో మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పవన్‌కళ్యాణ్‌పై త్వరలో క్రిమినల్ కేసు దాఖలు చేస్తామన్నారు. ఓ భక్తుడు ఈ నెల 17వ తేదీన రూ.10 వేలు చెల్లించి శ్రీవాణి ట్రస్టు నుంచి పొందిన రసీదును ఆయన మీడియాకు చూపారు.



శ్రీవాణి ట్రస్టు నుంచి టీటీడీ ఇచ్చిన రసీదు

హాస్యభరిత కుటుంబ కథా చిత్రం నారాయణ అండ్ కో

తిరుపతి కల్చరల్: వినోదాన్ని పంచుతూ కడుపుబ్బ నవ్వించే హాస్య భరిత కుటుంబ కథా చిత్రం నారాయణ అండ్ కో అని, ఈ నెల 30న విడుదలవుతోందని, కుటుంబ సమేతంగా తిలకించి ఆశీర్వదించాలని చిత్రం యూనిట్ సభ్యులు కోరారు. చిత్ర హీరో సుధాకర్, హీరోయిన్లు పూజకిరణ్, యామిని, హాస్య నటుడు జయకృష్ణ, దర్శకుడు చిన్న పాటొట్టి చిత్రం ప్రమోషన్‌లో భాగంగా తిరుపతి లీలామహల్ సర్కిల్ సమీపంలోని ఓ హోటల్లో మీడియాతో మంచి కెమెరాతో క్వాలిటీలో రాజీలేకుండా సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు థియేటర్‌లో ప్రేక్షకులు నవ్వుతూ ఆనందభరితులయ్యేలా సినిమా రూపొందించామన్నారు. ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల చేతుల మీదుగా ఈ చిత్రం టీజర్ విడుదల చేశామని, 6 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ చూసి నవ్వుకునే చిత్రమని చెప్పారు. సినిమాలో సీనియర్ నటులు సప్తగిరి, ఆమని, దేవిప్రసాద్ వంటి వారు నటించారన్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ చిత్రంలోని పాటలు ప్రేక్షకుల ఆదరణ పొందాయన్నారు.



నారాయణ అండ్ కో చిత్ర హీరోయిన్లు పూజ కిరణ్, యామినితో హీరో సుధాకర్

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కూడళ్ల సుందరీకరణ

తిరుపతి తుడా: ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తిరుపతి నగరంలోని ప్రధాన కూడళ్లను తీర్చిదిద్దనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె శనివారం కూడళ్లు, రోడ్ల సుందరీకరణపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరంలో రోడ్ల అభివృద్ధి పనులు దాదాపు పూర్తయినట్టు తెలిపారు. క్రమంలో తిరుపతికి ఉన్న ప్రతిష్ఠ, ప్రముఖుల రాకను దృష్టిలో ఉంచుకుని ప్రధాన కూడళ్లను ఆధునీకరించి సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఎంఆర్ పల్లి కూడలిలో మహాత్మాగాంధీ దండీ యాత్రను ప్రతిబింబించేలా విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇటీవల బాలాజీ కాలనీలో స్టీల్ స్క్రాప్‌తో నెమలి నమూనాను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో మరిన్ని కూడళ్లలో స్క్రాప్ ప్రతిమలను పెడతామన్నారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు

- 9 మందికి గాయాలు



ధ్వంసమైన కారు (ఇన్‌సెట్) గాయపడిన దినేష్

చంద్రగిరి (తిరుపతిరూరల్): పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై శనివారం ఐతేపల్లె వద్ద కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. తొమ్మిది మంది గాయపడ్డారు. తమిళనాడులోని తిరువణ్ణామలైకి చెందిన ఏలుమలై కుటుంబీకులు కారులో రెండు రోజుల క్రితం తిరుమల వచ్చారు. తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్ దినేష్‌కు తీవ్ర గాయాలు కాగా, ఏలుమలై, పరమేష్, అరుణ్‌కుమార్, ప్రతాప్, జయ, చిత్ర, ధనుష్, ఆర్తి స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఆరుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: గంజాయి విక్రయం కేసులో ఆరుగురికి ఈ నెల 30వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత శనివారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. తిరుపతి దామినేడుకు చెందిన పేరం సాయికృష్ణారెడ్డి, తిరుపతి రూరల్ పద్మావతిపురానికి చెందిన ఈ.నవీన్, తిరుపతి రూరల్ పేరూరు ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన గొల్ల హేమంత్ అలియాస్ బిట్టు, తిరుపతి పార్వతీపురం ఏకలవ్య కాలనీకి చెందిన డి.మునిరాజమ్మ అలియాస్ భూసమ్మ, తిరుపతి రూరల్ హరిపురం కాలనీకి చెందిన కె.పవన్‌కుమార్, చంద్రగిరి మండలం ఆది ఆంధ్రవాడకు చెందిన పసల కిషోర్‌ను ఈనెల 17వ తేదీ పద్మావతిపురం సమీపంలోని ఓ హోటల్ వద్ద తిరుపతి రూరల్ ఎస్ఈబీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పి.కిషోర్ అనే వ్యక్తి వద్ద ఎక్కువ మొత్తంలో గంజాయిని కొని చిన్న ప్యాకెట్లుగా మార్చి ఇతరులకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. పోలీసులు ఆరుగురిని అరెస్ట్‌చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గంగయ్య



పాకాల: ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని అడుసుపల్లికి చెందిన కె.గంగయ్య ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ పదవి రావడానికి సహకరించిన ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ వరేంద్రకుమార్‌పాల్, రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పెంచలయ్య, ప్రసాద్

తిరుపతి కల్చరల్: తిరుమలలోని ఎస్‌వీఎన్ గ్రూప్స్ ఆఫ్ హోటల్స్ వ్యవస్థాపకుడు నరసింహులు 9వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ నేత పెంచలయ్య, వారి సోదరుడు ప్రసాద్ శనివారం రుయా ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. పెంచలయ్య మిత్ర బృందం పాల్గొన్నారు.

24 నుంచి కల్యాణ వెంకన్న వైభవోత్సవాలు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, పీఆర్వో రవి

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలో కొలువైన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సాలకట్ల సాక్షాత్కర వైభవోత్సవాల బుక్‌లెట్‌ను జేఈవో వీరబ్రహ్మం శనివారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఆవిష్కరించారు. వైభవోత్సవాల్లో భాగంగా జూన్ 22న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. జూన్ 24న పెద్ద శేష వాహనం, జూన్ 25న హనుమంత వాహనం, జూన్ 26న గరుడ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

27న పార్వేట ఉత్సవం

సాక్షాత్కర వైభవోత్సవాల మరుసటి రోజైన జూన్ 27న పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవారిమెట్టు సమీపంలోని మండపంలో ఉదయం 7 నుంచి ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, పీఆర్వో డాక్టర్ రవి, అర్చకులు నారాయణదీక్షితులు పాల్గొన్నారు.

లిటిల్ ఏంజెల్స్‌లో ఫాదర్స్ డే

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి యశోదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ ఆవరణలో శనివారం ఫాదర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో ప్రీ ప్రైమరీ విద్యార్థుల తండ్రులు పాల్గొన్నారు. వీరికి వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల చైర్‌పర్సన్ ఎం.రమాదేవి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

తిరుపతి తుడా: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె శనివారం అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ చిందేపల్లి, జీపాళెం, కల్లూరు, ఎం.కొత్తపల్లి, సూరప్పకశం , టీసీ.అగ్రహారం ప్రాంతాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను పూర్తి చేసి జూలైలో ప్రవేశాలు చేసేలా లక్ష్యం విధించామన్నారు. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్క కాంట్రాక్టర్ జూలై 17 కల్లా లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. లేఅవుట్లలో నీటి కొరత రాకుండా బోర్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైతే కొత్త బోర్లు వేయించాలని సూచించారు. సిమెంట్, ఇటుకలు, ఐరన్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, హౌసింగ్ పీడీ.వెంకటేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

చెర్లోపల్లి సర్కిల్‌లో ఆక్రమణల తొలగింపు

తిరుపతి రూరల్: చెర్లోపల్లి సర్కిల్‌లో ఉన్న రోడ్డు ఆక్రమణలు, ఇష్టారాజ్యంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలపై తిరుపతి రూరల్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రోడ్డు ఆక్రమణల వల్ల ఇటీవల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నూతనంగా తిరుపతి రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సుబ్రమణ్యంరెడ్డికి పలువురు గ్రామస్తులు రోడ్డు ప్రమాదాలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన శనివారం సర్కిల్‌ను సందర్శించారు. ఆక్రమణలు తొలగించాలని దుకణాదారులను ఆదేశించారు. రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. హద్దు వరకే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, ఆక్రమణ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ సుబ్రమణ్యంరెడ్డి హెచ్చరించారు. సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించిన సీఐని పుదిపట్ల, చెర్లోపల్లి, పెరుమాళ్లపల్లి గ్రామస్తులు అభినందించారు.

జగనన్న సురక్ష పథకాన్ని ఇంటింటికీ చేరవేయాలి

చంద్రగిరి(తిరుపతి రూరల్): జగనన్న సురక్ష పథకాన్ని ఇంటింటికీ చేరవేయాలని ఎంపీడీవో రమేష్ బాబు పిలుపునిచ్చారు. చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జగనన్న సురక్ష పథకంపై సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జగన్న సురక్ష పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు, కౌలు రైతుల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, ఈవోపీఆర్డీ శశిరేఖ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌బాబు

ఆలయ పాలకమండలి బాధ్యతల స్వీకరణ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు యోగిమల్లవరంలో వెలసిన కామాక్షి సమేత పరాశరేశ్వర స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు శనివారం బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా తిరుచానూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, పొక్కాలమ్మ ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తాత్కాలికంగా బాధ్యతలు చేపట్టామని, 29న వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రమాణస్వీకారం చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, పద్మావతిపురం మాజీ సర్పంచ్ గణపతి నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, బోర్డు సభ్యులు వేణుగోపాల్, తిరుపాల్ రెడ్డి, వాసు రాయల్, అమరావతి, భారతి, రేణుక, వివేక్ గురుకుల్, వార్డు సభ్యుడు మునీంద్ర రాయల్, చంద్రశేఖర్, లోకేష్ రెడ్డి పాల్గొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న పాలక మండలి సభ్యులు

చిలకమర్తికి ఘన నివాళి

తిరుపతి కల్చరల్: ప్రముఖ సాహితీవేత్త చిలకమర్తి లక్ష్మీనరసింహారావుకు శనివారం చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్ర వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహారావు వర్ధంతిని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించారు. చిత్రపు హనుమంతరావు మాట్లాడుతూ అధ్యాపక వృత్తితో జీవితం ప్రారంభించిన చిలకమర్తి లక్ష్మీనరసింహారావు నాటక, పద్య రచనలతో ప్రజలను ప్రభావితం చేశారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఆయన రచించిన భరత ఖండంబు పాడి ఆవు.. లేగదూడల మూతులు బిగియగట్టి పాలు పితుకుతుండే తెల్లవారు... అనే గేయం భారతీయులను ఉర్రూతలూగించిందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు భగవంతుల జయలక్ష్మి, డాక్టర్ అక్కిరాజు, శమంతకమణి, సీఆర్‌కే.శేషగిరిరావు పాల్గొన్నారు.



చికలమర్తికి నివాళులర్పిస్తున్న చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం ప్రతినిధులు